క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తుగ్గలి: మండల పరిధిలోని జీ.ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, బొల్లవానిపల్లి, కడమకుంట్ల, పీ.కొత్తూరు, పగిడిరాయి, బాటతండ, రోళ్లపాడుతండ, మిద్దెతండ తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఫర్నిచర్, ఓటర్లకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ర్యాంపుల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ షర్మిల, ఆర్ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంత్రాలయం మండలం నారాయణపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యం (960 ఒరిజినల్‌ఛాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు కోసిగికి చెందిన మధుకృష్ణ, నారాయణపురానికి చెందిన ఉరుకుందును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్నాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నెంబర్ 94409 02579కు ఫోన్/మెసేజ్ ద్వారా తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యార్థిని ప్రతిభ



ఆవుల హున్సిక వర్షిని

దేవనకొండ: మండలకేంద్రానికి చెందిన ఆవుల హున్సికవర్షిని మార్చి 10వ తేదీన నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయిలో 21వ ర్యాంకు, జోన్–4 స్థాయిలో 55వ ర్యాంకు సాధించింది. తద్వారా పత్తికొండలోని గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందింది. మొత్తం 50 మార్కులకుగానూ 47 మార్కులు సాధించింది. విద్యార్థి సీటు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గం పరిధిలోని 297 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆర్‌ఓ డి.రామునాయక్ ఆదేశించారు. ఆయన గురువారం హాలహర్వి, చింతకుంట, మొదేహాళ్, నిట్రవట్టి, శిరుగాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, ర్యాంపులు తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని బీఎల్‌ఓలు, అధికారులను ఆదేశించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గురురాజారావు



ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది గురురాజారావు ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో న్యాయవాది వెంకటేశ్వర్ రెడ్డిపై 8 ఓట్ల మెజారిటీతో ఆయన గెలుపొందారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది రంగనాథ్ వ్యవహరించగా 88 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నూతన అధ్యక్షుడిని సీనియర్, జూనియర్ న్యాయవాదులు సత్కరించారు.

అశ్వవాహనంపై శ్రీవారు

మద్దికెర: పెరవలి రంగనాథుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు సతీసమేతుడై అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై పల్లకీలో స్వామివారిని ఉంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

గోనెగండ్ల/నందవరం: అధికారులు ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని ఆర్‌ఓ చిరంజీవి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సెక్టోరియల్ ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్, బీఎల్‌ఓలతో ఎన్నికల కసరత్తుపై సమావేశం నిర్వహించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు, పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవడం, పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల కల్పనపై సూచనలు చేశారు.

➡ అలాగే నందవరం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సెక్టోరియల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి ఎన్నికల ఏర్పాట్ల పై పలు సూచనలు చేశారు.

నాడు గారడీలు.. నేడు అభివృద్ధి పరుగులు

- టీడీపీ పాలనలో హామీలు, శిలాఫలకాలతో సరి
- జగనన్న పాలనలో పట్టాలెక్కిన అభివృద్ధి
- ఎమ్మిగనూరులో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటును విస్మరించిన టీడీపీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.12.60 కోట్లు నిధులు కేటాయించడంతో శరవేగంగా పనులు
- టీడీపీ శంకుస్థాపనతో వదిలేసిన ఏఐఐబీని నిధులు కేటాయించి మొదలెట్టిన జగనన్న ప్రభుత్వం



2003లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిలాఫలకం



2019లో మరోసారి శిలాఫలకం ఏర్పాటు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతో తుది దశకు చేరిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం



ఆస్పత్రి లోపల వార్డుల నిర్మాణం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజారోగ్యమే పరమావధిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతోంది. గ్రామాలు, పట్టణాల్లో ఆస్పత్రుల నిర్మాణాలు, ఇప్పటికే ఉన్న ఆస్పత్రుల స్థాయి పెంచి సౌకర్యాలు కల్పించడం, భవన నిర్మాణాలు చేపడుతూ వైద్య ఆరోగ్య సేవలను విస్తృతం చేస్తూ వస్తోంది. నూతన భవనాల్లో అధునాతన వైద్య పరికరాలు, స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది నియామక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు భిన్నంగా గత టీడీపీ ప్రభుత్వం ఆయా పనులు చేపట్టలేక గత ఎన్నికల ముందు పబ్లిసిటీ కోసం శిలాఫలకాలతో సరిపెట్టి ఓట్ల కోసం కుయుక్తులు పన్ని బొక్కబోర్లా పడింది.

➡ ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి నియోజవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవర్గ ప్రజలకు పెద్ద ఆదారం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచి రూ.12.60 కోట్లతో భవన నిర్మాణం చేపట్టారు. ఆయా పనులు మరో నెల రోజుల్లో పూర్తి కానున్నాయి.

విస్తృతం కానున్న వైద్యసేవలు

ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతుండగానే పెంచిన సామర్థ్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఉన్న 50 పడకల ఆస్పత్రిలో కేవలం 40 మంది సిబ్బంది మాత్రమే పనిచేసేవారు. ప్రస్తుతం వంద పడకలకు సామర్థ్యం పెరగడంతో 105 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. గైనాకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్యుడు, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, అనస్తీషియా, జనరల్ సర్జరీ, ఆప్తమాలజీ, సైక్రియాట్రిక్, రేడియాలజీ విభాగాల వైద్యులతో పాటు 40 మంది నర్సుల నియామకాలు జరిగాయి. అలాగే అధునాతన పరికరాలు మంజూరవడంతో భవనం పూర్తయిన తర్వాత వైద్య సేవలు విస్తృతం కానున్నాయి.

నాడు ప్రచార ఆర్భాటం

పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)ని వంద పడకల వైద్యశాల (ఏరియా హస్పిటల్)గా మార్చేందుకు అప్పటి మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 2003 నవంబర్ 24న శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే నిధులు మాత్రం మంజూరుకాకపోవడంతో శిలాఫలకం దిష్టి బొమ్మగా మారిపోయింది. తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన కుమారుడు బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గత ఎన్నికల ముందు 2019 మార్చి 8న ఇదే ఆస్పత్రిని వంద పడకల హాస్పిటల్‌గా మార్చేందుకు అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తిచే మరోసారి శిలాఫలకం ఆవిష్కరింపజేసి చేతులు దులుపుకున్నారు. శిలాఫలకాలు వేసి కాగితాలపై మాత్రమే ఉత్తర్వులు ఇప్పించుకోగలిగారే కాని ఒక్క పైసా నిధులు మంజూరు చేయించిన దాఖలాలు లేవు.

నేడు – తుది దశకు నిర్మాణాలు

ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక చొరవతో ఆస్పత్రి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మొదట్లో కొంత జాప్యం జరిగినా తరువాత పనులు వేగవంతం అయ్యాయి. రూ.12.60 కోట్లతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. రెండంతస్తుల్లో నిర్మించే భవనంలో వార్డు గదులు, మెడికల్ యునిట్లు, వైద్యులు, అత్యవసర విభాగాలు, శస్త్ర చికిత్సల గదుల నిర్మాణ పనులు నెల రోజుల్లో పూర్తికానున్నాయి.

టీడీపీ హయాంలో కాగితాలకే పరిమితం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ నిధులు మంజూరు చేశారు. గత టీడీపీ పాలనలో కేవలం కాగితాల మీదే వంద పడకల ఆస్పత్రి మంజూరైంది. నిర్మాణ పనులకు ఒక్క పైసా విడుదల కాలేదు. అప్పుడు టీడీపీ కేవలం ఎన్నికల కోసమే శిలాఫలకాలు వేసింది. ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రి భవనం పూర్తయితే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో వస్తాయి. దీంతో వైద్యం కొరకు ఇతర ప్రాంతాలకు వెళ్లే కష్టాలు ఉండవు.

– ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

వైద్యానికి ప్రాధాన్యత



పట్టణంలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. సీఎం వైఎస్ జగనన్న విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నందున నేడు వంద పడకల ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందుబాటులో రానున్నాయి. ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతే.

– బుట్టారేణుక, ఎమ్మెల్యే అభ్యర్థి

దాహార్తి తీర్చేందుకు చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: గత ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 27న ఎమ్మిగనూరు పట్టణానికి మంచి నీటి సదుపాయం కల్పించేందుకు ఏఐఐబీ స్కీం కింద రూ.148 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు స్థానిక సోమప్ప సర్కిల్ వద్ద మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మంత్రులచే శిలాఫలకాలను ఆవిష్కరింపజేశారు. అయితే నిధుల కేటాయింపు లేకుండా శిలాఫలకాలకే పరిమితం చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో నిధుల కేటాయింపు జరిగింది. దీంతో గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసి పట్టణంలోని ఫిల్టర్ బెడ్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు పంపింగ్ చేసి కొళాయిల ద్వారా నీటి సరఫరా చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పైప్‌లైన్ల ఏర్పాటు, పట్టణంలో 5 ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫిల్టర్ బెడ్ల ద్వారా డిస్ట్రిబ్యూషన్ పాయింట్ల ఏర్పాట్ల పనులు చకచకా జరుగుతున్నాయి. త్వరలో ఆయా పనులు పూర్తికానున్నాయని పబ్లిక్ అండ్ హెల్త్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.



టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఏఐఐబీ స్కీం శిలాఫలకం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



మద్దికెరలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విన్నవించారు. ఆమె గురువారం మద్దికెర నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని మద్దమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలోనే ప్రజల్లోకి వస్తారని తర్వాత కనబడకుండా పోతారని అలాంటి వారిని నమ్మవద్దన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ అనిత, సర్పంచులు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీరంగడు, సుబ్బయ్య, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

తుగ్గలి: పెద్దమ్మవ్వ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అమ్మవారిని వేడుకున్నారు. మండల పరిధిలోని లంకాయపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోదరుడు శంకరరెడ్డి, బంధువులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



సభావేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో శుక్రవారం సాయంత్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' సభలో పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఆమె సభా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్ల జగనన్న పాలనలో దేశంలోనే ఆదర్శంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల వారికి అండగా నిలిచారని కొనియాడారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి 600 హామీలిచ్చి అధికారం చేపట్టాక ఏ ఒక్కటీ అమలుచేయలేదని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్తు కోసం మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుద్దామని పిలుపునిచ్చారు. నాయకులు బుట్టా ప్రతుల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గోనెగండ్ల: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. ఆమె గురువారం గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడి కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మిగనూరులో శుక్రవారం జరిగే సిద్ధం సభకు పార్టీ శ్రేణులు పెద్దెత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిద్ధం సభకు సమాయత్తం



మాట్లాడుతున్న తెర్నెకల్ సురేందర్ రెడ్డి

దేవనకొండ: ఎమ్మిగనూరులో శుక్రవారం జరిగే 'మేమంతా సిద్ధం' బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా జేసీఎస్ కన్వీనర్, ఆలూరు ఎలక్షన్ అబ్జర్వర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం దేవనకొండలోని పీఏసీఎఫ్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. మండలం నుంచి సభకు 45 బస్సులు బయలుదేరుతున్నాయన్నారు. స్వచ్ఛందంగా దాదాపు 200 వాహనాలు వెళ్లే అవకాశం ఉందని, మండలం నుంచి 5 వేల మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్తున్నట్లు చెప్పారు. నాయకులు రాజారెడ్డి, తపాల శ్రీనివాసులు, కబీర్‌దాసు, లుముంబా, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీలు రంగమ్మ, నెట్టకంటమ్మ, ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో సమావేశం ఎమ్మిగనూరు సిద్ధం సభకు శ్రేణులను సమాయత్తం చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో నియోజకవర్గంలోని తంగరడోణ, బిణిగేరి, చిగిలి, అలిగేర, శంకరబండ, ఆస్పరి మీదుగా పత్తికొండకు సీఎం బస్సు యాత్ర సాగుతుందన్నారు.

కృష్ణగిరి: 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన గురువారం కృష్ణగిరిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. సిద్ధం సభకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు.

తుగ్గలి: మండలంలోని రాతన, తుగ్గలి మీదుగా సాగే సీఎం జగనన్న బస్సు యాత్ర, సాయంత్రం ఎమ్మిగనూరులో నిర్వహించే సీఎం బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్ పిలుపునిచ్చారు.

ఆస్పరి: మండలం నుంచి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి సిద్ధం సభను విజయంవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య పిలుపునిచ్చారు.

చిప్పగిరి: మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జూటూరు మారయ్య పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి సిద్ధం సభకు కార్యకర్తలను సమాయత్తం చేశారు.

హొళగుంద: మేమంతా సిద్ధం సభకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శ్రీరాములు, మండల కన్వీనర్ షఫీవుల్లా పిలుపునిచ్చారు.

శ్రీరంగనాథుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మద్దికెర: శ్రీరంగనాథుడి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని తాత్కాలిక, శాశ్వత హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు, ఇతర ఆదాయాన్ని గురువారం లెక్కించగా రూ.22,17,652 సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఏసీ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించడం జరిగిందన్నారు. స్వామి వారి చదివింపుల ద్వారా రూ.3,68,178, సేవా టికెట్ల ద్వారా రూ.2,45,690, పర్మినెంట్ హుండీ ద్వారా రూ.9,66,742 తాత్కాలిక హుండీ ద్వారా రూ.6,37,042 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది రూ.19,81,654 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.2,35,998 పెరిగినట్లు వివరించారు. అర్చకులు రంగస్వామి, సిబ్బంది రఘు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.